

# ఓ చిన్ని కథ

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

"మీ కోసం ఎవరో వచ్చారు?" అంది శారద లుంగీ అందిస్తూ. అలికిడికి లేచిందిలా ఉంది. పార్టిషన్ తడిక పక్క పవళించిన మా మూడేళ్ల చంటిది రాగం అందుకుంది.

"ముందు దాన్ని సముదాయించు' అన్నాన్నేను చిరాకుగా. శారద తడిక తోసుకుని లోపలకి వెళ్లి చంటి దాన్ని భుజాన వేసుకొని వచ్చింది. నేనీలోపు కాళ్లు కడుక్కు వచ్చాను. కంచంలో వడ్డిస్తూ మళ్లీ చెప్పింది. "రేపు ఉదయాన్నే వస్తానన్నారు."

"ఎవరో పార్టీ అయి ఉంటుంది" అన్నాను స్వగతంగా. "కాదులా ఉంది" అంది తను.

నేను మగ్గంలో మనిషిని. నా యావ పార్టీల మీదే ఉంటుంది. రోజు వేస్టయితే గుండె కుదించుకు పోతున్నట్లు ఫీలవుతాను. "ముసలాయన భోజనమైందా?"

"ఆ ఏదో కతికేరు. పెరుగు పుల్లగా ఉందని గునిగేరు."

ముసలాయన అంటే మా నాన్న. సర్దుబాటు మనస్తత్వం కాదాయనది. అంతా రివర్సు కేసు. గిజాటు వ్యవహారం. వంట పెందలాడే అయిన రోజున వేళకి రాడు భోజనానికి. లేటయిన రోజున ముందే తయార్. అందుకే శారద ఉదయం తొమ్మిదిన్నరకే 'భోజనం తయార్' బోర్డు పెడుతుంది. "అన్నపూర్ణ ఏది?" అడిగాను చేయి కడుక్కుంటూ.

"పక్కింటి వాళ్లతో సిన్మాకి వెళ్లింది" చెప్పింది.


"నీకెన్ని సార్లు చెప్పాను సెకండ్ షోలకి పంపవద్దని?" చిరాకు పడ్తూ అన్నాను. సిగరెట్ వెలిగించి చాప మీదికి ఒరిగాను.

నిద్రపట్టదు. పగలంతా గాడి పొయ్యి దగ్గర శ్రమించినా, శరీరం ఎంత పులిసినా నిద్ర రాదు. నాకు అదే దౌర్భాగ్యం! కళ్లు బరువెక్కవు. గుండె బరువెక్కుతుంది. రేగడి మట్టిలో బలిసిన పంపర పనస చెట్టులా తోస్తుంది అన్నపూర్ణ. దాని పెండ్లి సమస్య నాకో గుదిబండ. సీజన్ - అన్సీజన్ జారుడు మెట్ల మీద విన్యాసాలు చేస్తూ, అంగుళం పైకి పాకితే ఆరంగుళాలు కిందికి జారుతూ, నిత్యం కష్టాల నైవేద్యంతో బ్రతికే మనిషిని.

కాలగమనం అంటారో, విధి వైపరీత్యం అంటారో నాకైతే తెలియదు కాని, నోటిలో వెండి చెంచాతో పుట్టి అల్యూమినియం బొచ్చెలో భోజనం చేస్తున్న వాడిని.

శారద పక్క చేరింది. నా మీదకి వంగి, "ఉదయాన్నే సర్ఫు తెప్పిస్తేనే మీ దీక్షా వస్త్రాలకి మోక్షం" అంది. అవును. వారంగా అట్టలు కట్టుకుపోయాయి అవి. నిజంగా దీక్షావస్త్రాలు కావు. మా జీవన రక్షాకవచాలు.

ఆలోచనలతో ఇంటి కప్పుకేసి చూస్తున్నాను. కప్పు కేసి చూసినప్పుడల్లా అప్పు కనిపిస్తుంది. గాడి పొయ్యి దగ్గర నిప్పుల కంటే సెగలు విడుస్తూ నన్ను భయభ్రాంతుడిని చేస్తూ ఉంటుంది.



**జీవితం తామరాకు మీది నీటి బొట్టు కాదు - రూపాయి కాగితం మీద నెత్తుటి తెట్టు.**

గంట గడిచింది. శారదని లేపాను. "కాసింత కాఫీ". పెదవులు విడకముందే, పెదవి చప్పరించింది. "పోనీ డికాషన్!" శారద మత్తుగా లేచింది.

నా కదో అలవాటు నిద్రపట్టకపోతే కాఫీ తాగటం. అదీ లభ్యం కానప్పుడు, ఉండనే ఉన్నది డికాషన్ సెక్షన్. ఆత్మ సంతృప్తి కోసం హాబీ అని చెప్పుకోవచ్చునేమో! బ్లాక్ కాఫీ అనుకుంటే ఇంకా రిచ్‌గా ఉండదూ?

శారద అప్పుడప్పుడూ పెరటి గోడ మీద పక్కింటి వారితో పురాణంలో ఈ గొప్పే చెబుతూ ఉంటుంది. తాడు లేక పోయినా బొంగరానికి 'ములికి' మహా పదునైనది అని చెప్పుకోవటం, దిగువ తరగతిలో ఉంది. మొదటి తరగతి వాళ్లలా మెసిలే వారికి మొదటి లక్షణం.

వంట గదిలోంచి గ్లాసుతోపాటు కిరోసిన్ కంపూ వచ్చింది వెనువెంట. కంపును కూడా ఇంపుగా భావించటం లేనివాడికి భగవంతుడిచ్చిన వరం.

అరగంటకి కనురెప్పలు కాసింత బరువెక్కుతుండగా తలుపు చప్పుడయింది. శారద లేచి వెళ్లి తలుపు తీసింది. సినిమాకి వెళ్లిన అన్నపూర్ణ వచ్చింది. కళ్లయితే మూసుకున్నాను కానీ అంతా తెలుస్తూనే ఉంది. పెరటిలో కాళ్లు కడుక్కోవటం, డబ్బాలోంచి ఏదో తీసుకు తిని మంచి నీళ్లు తాగటం. ఆనక తలగడ తీసుకుని వంటగదిలోకి వెళ్లి తలుపు జారేయటం.

తంతు జరగాలంటే తలుపులు జారేసుకుంటే చాలా? తలపులకు తలుపు వేయగలమా? అందుకేనేమో సర్దుబాటును గాడిదన్నాడు ఓ పెద్దాయన.

✦ ✦ ✦

తెల్లారింది.


ఇంకా మంచు వీడలేదు. కళాయిలో అప్పుడంలా సూర్యుడు విచ్చుకుంటున్నాడు. ఇంతలో వాళ్లు వచ్చేశారు - ఇద్దరు!

"నా పేరు చంద్రశేఖర శాస్త్రి. ఈయన నా బావమరిది. పిచ్చి శాస్త్రి అంటారు." లావుగా - ఎర్రగా ఉన్నాయన పరిచయం చేసుకున్నాడు. పరస్పర నమస్కార ప్రతి నమస్కారాల పర్వం పూర్తయింది.

"మీ గురించి విని వచ్చాము. ఈ ఏరియాలో మీకు చాలా మంచి పేరుంది. వంటలు చేయటంలోనే కాదు. యథార్థవాది అని కూడా! మన పర.. తరతమ భేదం లేకుండా ఉన్నది ఉన్నట్లు నిష్కల్మషంగా - సూటిగా - కుండ బద్దలు కొట్టి చెప్తారని ఎందరో చెప్పగా విన్నాం! విని వచ్చాం!!"

"లౌక్యమా? నువ్వెంతటి కంట్రీ బ్రూట్‌వే. ఇంతకీ వచ్చిన విషయం చెప్పారు కాదు."

"మా వాడు బందరులో పన్జేస్తున్నాడు. వీడికి ఒక్కడే కొడుకు. వాడూ ఉద్యోగి




అయినాడు. ఆ మధ్య తెనాలిలో సంబంధం చూశాం. పిల్ల బావుంది. మిగతా అన్నీ అనుకూలంగానే ఉన్నై. ఎటొచ్చీ పిల్ల తల్లి వేషధారణ కొంచెం కృతకంగా తోచింది. ఆవిడా - ఎర్రగా పండిన కిళ్లీ నోరు 'అదోలా' అనిపించినై. ఆవిడ పేరు సూరమ్మగారు. మీకు పిన తల్లి అని తెల్సింది. పిల్లయితే బావుంది కాని గుణగణాలు..." అర్ధోక్తిలో ఆగిపోయాడు, చంద్రశేఖర శాస్త్రి.

"పైగా మీరు - మేము దగ్గర వాళ్లం. మీదీ దివి సీమ - మాదీ దివి సీమ. మీ నోటి వెంట విని సంబంధం ఖాయం చేసుకుందామని ఇలా వచ్చాం" అన్నాడు పిచ్చి శాస్త్రి తనవంతుగా.

ఒక్క క్షణం సందిగ్ధం, సరిహద్దు మీద వేలాడుతున్న అనుభూతి! క్షణకాలం తుఫానులో చిక్కిన ఓడలా అల్లల్లాడింది నా అంతరంగం.

ఇరవై ఏళ్ల క్రితం -

పదేళ్ల వయస్సులో -

అమ్మపోయినప్పుడు అన్నపూర్ణని చంక వేసుకుని, అవిటి నాన్న వెంటరాగా, "పిన్నీ!" అంటూ పుట్టెడు దుఃఖంతో వెళితే "అక్క పోయాక అక్క పిల్లలతో మాకేం సంబంధం?" అని ధడాలున తలుపు వేసుకున్నది సూరమ్మ పిన్ని.

అలాంటి పిన్ని కూతురు పెళ్లి విషయంలో నేను వాస్తవం చెప్పాలి. వాస్తవం చెప్పాలంటే వాళ్ల విన్నదంతా నిజమే. అక్షరం పొల్లు పోదు.

మా పిన్ని నడవడిక మంచిది కాదు. ఆవిడకి పెళ్లి కాక ముందు రాంబాబుతో సంబంధం ఉండేది. ఏదో మెడలు వంచి అతగాడికే ఇచ్చి పెళ్లి చేద్దాం అనుకున్నారు కానీ, అతగాడుససేమిరా అంగీకరించలేదు. చదువును అర్ధంతరంగా ఆపేసి తన ఊరు వెళ్లిపోయాడు కూడా! మరి మూడు మాసాలు గడిచాయో లేదో ఎదురింటి వెంకట్రావుతో 'ఎఫైర్' నడిపింది. దాంతో మావయ్య బదిలీ చేయించుకోక తప్పలేదు. మొత్తానికి కట్నం బాగా ముట్టచెప్పి, శంకరం అనే అబ్బాయికి ఇచ్చి కట్టబెట్టారు.

ఆ సూరమ్మ, శంకరయ్యల ఒక్కగా నొక్క కూతురు - నీరద పెళ్లి విషయం గురించి ఇప్పుడు వీళ్లు వచ్చింది. రాకపోకలు లేకపోయినా అడపా దడపా వారి గురించి భోగట్టా తెలుస్తూనే ఉంది. అక్కడ అపార్ట్‌మెంట్ కొన్నారని, ఇక్కడ ఫ్లాట్ కొన్నారనిన్నూ - నీరద ఇంటర్ ప్యాసైందనిన్నూ. చదువుల సరస్వతి అని కూడా తెలిసింది.

యథార్థం పెదవి దాటి పోయింది. తమాయించుకున్నాను. పిన్ని మంచిది కాకపోవచ్చు. అంత మాత్రాన నీరద మంచిది కాదని ఎలా కితాబివ్వగలం? పైగా మంచి సంబంధం. ఒక్కగానొక్క కొడుకుట. కావలసినంత ఆస్తి ఉంది. ఏదో పాత ద్వేషం కడుపులో ఉంచుకొని నేనెందుకు చెడగొట్టాలి? పిన్ని ఎట్లా పోతేనేం? నీరద బంగారు భవిష్యత్తు సుఖంగా సాగుతుంది. దాని భవిష్యత్తు తుంచే హక్కు నాకెక్కడిది? అన్నపూర్ణ ఎంతో, నీరదా అంతే కదూ నాకు! పైగా వేయి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయమన్నారు. ఓ పెద్ద నిధి లోంచి ఓ రూపాయి జారిపోతే ఏంతో? నా గుడ్విల్‌లో ఈ చిన్న అనృతం అంతే.... అనిపించింది.

"మీరు విన్నవన్నీ వట్టిమాటలు. గిట్టని వాళ్ల ప్రచారం. గిట్టని వారు ఎవరా అని ప్రశ్నించవచ్చు. మా మావయ్యతో పనిచేసే ఒకాయన ఉన్నాడు లెండి. ఏదో వ్యక్తిగత ద్వేషంతో ఈ బురద చల్లేడాయన పాపం! మా పిన్ని ఇంత కాలమైనా అభాండం మోస్తూనే ఉంది. మా పిన్ని సీతమ్మ తల్లే కదూ!" జాలిగా చెప్పాను. ఆత్మీయంగా మెప్పించాను.

మంత్ర సిద్ధుడి దగ్గర మంత్ర ఫలం అందుకున్న మహానుభావుల్లా కాఫీలు తాగి వెళ్లిపోయారు వాళ్లు.

ఆ తర్వాత -

రెండు నెలలకి - పిచ్చి శాస్త్రి దగ్గర్నుంచి శుభలేఖ అందింది నాకు. ఓ మంచి పని చేశానన్న తృప్తి ఆ పూట భోజనం చేయనీయలేదు. పెళ్లికి వెళ్లలేక పోయాను తీరిక లేక. ఆసక్తి లేక కూడా!

నా విషయంలో అకాల భోజనం, అకాల నిద్ర సర్వసాధారణం. అకాలంలో ఆకలి బ్రతుకులు బ్రతుకుతున్న వారి జాబితాలో నేనూ మెంబరునే. అందువలన అకాలం నన్ను శాసించదు, వేధిస్తుంది మినహా. వికారాలు ఆశించవు; శోధిస్తాయి తప్ప; ఏదో కొండరాయి నెత్తిన ఉన్నట్లే ఉంటుంది నాకు.

మార్చి మార్చ్ చేసింది

ఏప్రిల్ వచ్చింది.

ఓ రోజు - సాయంత్రం నాలుగ్గంటల వేళ అప్పుడే ఓ పెళ్లి వంట చేసి వచ్చాను ఇంటికి.

సంచిలోంచి పీలర్లు, చాకులు తీసి సర్దుతోంది శారద. వినాయకుడి బియ్యం చేటలోకి వంపింది అన్నపూర్ణ. చంటిది చేటలో బియ్యంపైకి ఎగబడి పెళ్లి వారిచ్చిన లడ్డూలలో కిస్‌మిస్, జీడిపప్పు పలుకులు ఏరుకుంటున్నది.

అప్పటిదాకా వీధి అరుగు మీద కూర్చున్న నాన్న లేచి వచ్చాడు. మంచం మీద నా పక్కనే కూర్చున్నాడు.

నాన్న నా పక్కనే చేరితే ఏదో విషయం ఉందన్న గుర్తు. పలకరించక్కర్లేదు. ప్రవాహం

అద్దంలో చూసుకుని, అందరూ అనే మాటలు నమ్మి, తాను కూడా ఓ ఆర్టిస్టునై పోగలననే ఆత్మవిశ్వాసంతో మద్రాస్‌లో కాలు పెట్టే అనేక మంది యువ తారల లాగే ఏలూరు నుంచి వచ్చింది విజయలక్ష్మి. ఎవరెవరినో పట్టుకుని, ఎలాగో ఓ వేషం సంపాదించింది. తెలుగు వారు ఇవ్వని అవకాశం ఓ తమిళ నిర్మాత యిచ్చాడామెకు.

'వండి చక్రం' ఆ చిత్రం పేరు. ఓ సారా కొట్టు చిన్నదిగా అందులో నటించింది . ఆమె నందరూ వింతగా చూశారు. టీనేజ్ బ్యూటీ - పదమూడేళ్ల పరువం, తీర్చి దిద్దినట్లున్న వంపు సొంపులు, కలలు గుంటోందా అన్నట్లున్న ఆ చిలిపి చూపుల కళ్లు- ఒక్కసారిగా చిత్ర పరిశ్రమను ఓ కుదుపు కుదిపేసిన తొలి చిత్ర సుందరి విజయలక్ష్మి. ఆమె ధరించిన పాత్ర 'సిల్కు'... అందుకే ఆ మందస్మిత మనోహర రూపానికి-- ఆమె పోషించిన సిల్కును చేర్చి 'సిల్కు స్మిత'ను చేసింది పరిశ్రమ. సెక్స్ బాంబ్ అన్నారు ఆమెనంతా. ఆమె ఏదో సావిత్రి వంటి నటి కావాలనుకుంది . కాని తొలి చిత్రంలో ఆమెకు వచ్చిన పేరు-ఆమె చూపిన నటన-ఆమెను శృంగార నృత్య తారగా స్థిర పరిచేసింది. చక్కటి నర్తకిగా పేరు తెచ్చింది. 'సిల్కు' డాన్సుంటే చిత్ర విజయం తథ్యం అనే నమ్మకాన్ని కలిగించింది.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్రా లన్నిటిలో స్మిత పాట, ఆట విధాయకంగా వుండవలసిందే! ప్రేక్షకుల ఆదరణ, పరిశ్రమ కోరిక, పంపిణీదారుల సెంటిమెంట్ అన్నీ స్మితకు శ్రీరామ రక్షగా నిలిచాయి. 14 సంవత్సరాల వ్యవధిలో 350



## ఆర్టిస్టుల మృత్యువులు అభిశాపాలు

చిత్రాలకు మించి నటించింది, నర్తించింది!

ఇంత గ్లామర్, పేరు, పొందిన సిల్కు స్మిత ఆత్మహత్య చేసుకుందని వార్త... పైగా ఆర్థికపరమైన చికాకులు దానికి కారణమని ఒకరు, విఫలమైన ప్రేమ కారణమని మరొకరు, రకరకాల భాష్యం చెబుతున్నారు.

స్మిత అంతరాంతరాల్లో వున్నది విజయలక్ష్మే! ఆ చిన్ననాటి చిన్నారి మారలేదు. అందరినీ ప్రేమిస్తూ, అందరి ప్రేమనూ అర్థిస్తూ అందరి కోసం బ్రతుకుతూ, హాయిగా పదిమంది మేలు చూస్తూ బ్రతకాలని కోరుకునేస్మిత మనస్సు వేరు.

'ప్రేమ' సినీతారల పాలిట ఓ శాపం! ఆత్మీయత, ఆప్యాయత, ఎంతగా కావాలని కోరుకుంటారో అంతకు పదింతలు ఎదురుదెబ్బలు తింటూ వుంటారీ రంగంలో. ప్రేమ వలన విజ్ఞత కొరవడుతుంది. శాంతి దూరమవుతుంది ప్రపంచమే శూన్యమై కనిపిస్తుంది. చివరికి తన లోపలి బాధ చెప్పుకునేందుకు కూడా మంచి మనసున్న మనిషి కరువైపోతాడు. దానితో ఏం చేయాలి ఆ తార? ఎందుకీ బ్రతుకనే నిరాశా నిస్పృహలు చుట్టు ముట్టేస్తాయి. ఎటుచూసినా, దగా, మోసం, కుట్ర ఇవే కనిపిస్తాయి.

విసిగి వేసారి విచలిత అయిన స్మిత-ఆత్మహత్య చేసుకుందన్నారు. 'రేపు ఏమవుతామో మనకేం తెలుసు' అంటూండే వేదాంతి సిల్కు స్మిత.

అర్థంతర మరణానికి-అర్థం తెలిస్తే...? మన తారల కింత దౌర్భాగ్యం కలగదేమో! ఆమె ఆత్మ శాంతికి అశేషాంధ్ర ప్రేక్షక జనం జోహారర్పిస్తుంది

**గౌతమ్**

---

సాగుతుంది.

"మొన్న అన్నపూర్ణను చూసి వెళ్లిన తెనాలి సంబంధం వాళ్లు ఉత్తరం రాశారు ఓ సారి వచ్చి వెళ్లమని. బహుశా మాటలకై ఉంటుంది. మాట్లాడి సెటిల్ చేసుకుంటే జేష్ఠ మాసంలో ముహూర్తాలు ఆఖరు... రేపు పంచమి. నీకేం పని లేదుగా?"

అన్నపూర్ణ పెళ్లి విషయంలో చాలా ఆత్రుత పడ్తున్నాను. ఆ బాధ తీరితే గాని నా గురించి నేను ఆలోచించుకోలేను. "పొద్దుటే బయలుదేరుదాం!" చెప్పాను.

నాన్న తేలిగ్గా లేచి రాతి ఉసిరి చెట్టు కింద పడక్కుర్చీలోకి జారేడు. పారవశ్యం పొంగిందిలా ఉంది, బీడీ పొగ సుడులు తిరుగుతోంది.

✤ ✤ ✤

"పిల్ల నచ్చింది. కుందనపు బొమ్మలా ఉంది. మీరిస్తానన్న కట్నం కూడా నచ్చింది. కానుకలు కూడా మెచ్చే విధంగానే ఉన్నై. ఎన్ని ఉన్నా మచ్చ ఉన్న పిల్లని ఎలా చేసుకుంటాం చెప్పండి?" వరుడి తల్లి చెప్తున్నది.

"మచ్చా! మా అమ్మాయికి బొల్లి లాంటివి ఏవీలేవు" అన్నాను అమాయకంగా.

ఆవిడ నవ్వింది.

"నేను మాట్లాడేది ఆ మచ్చల గురించి కాదు. నడతని గురించి. ఎవరో బైటి వాళ్లు చెబితే నమ్మక పోదుము. స్వయానా మీ పిన్ని సూరమ్మ గారే చెప్పింది. నమ్మకుండా ఎట్లా ఉంటాం చెప్పండి?"

అయిపోయింది! అంతా అయిపోయింది. ముడి పడ్తుందనుకున్న సంబంధం విడిపోయింది. అప్రతిష్ఠ ఉరితాడు బిగించి మరీ విడిపోయింది. అన్నపూర్ణ పెళ్లి నా జీవిత లక్ష్యంగా భావించాను. ఎంతో శ్రమించాను. కటిక దరిద్రం అనుభవించాను. ఇంత చేసి, ఇన్నాళ్లుగా కూడబెట్టుకున్నది తునాతునకలై పోయింది.

కళ్లలో తుళ్లింత పెట్టుకుని మరీ వచ్చాను. ఇప్పుడు మేను తూలుతోంది. హఠాత్తుగా శూన్యంలో కోదండం వేసినట్లుగా ఉంది. నాన్న పరిస్థితి అంతే! మనిషి భారంగా ఉన్నాడు.

ఇద్దరం పంచరు పడ్డవారిలా స్టేషనుకు చేరాం. దారిలో ఇద్దరం మాట్లాడుకోలేదు. రైలు గంట లేటు. బల్ల మీద కూలబడ్డాం. మర్మస్థానంలో గిలక్కాయతో కొట్టినట్లు గిజగిజలాడుతున్నది నా మనసు. దుఃఖం కమ్ముకు వస్తున్నది. అతి కష్టం మీద మాట పెగుల్చుకుని అన్నాను నాన్నతో- "చూడు, సూరమ్మ పిన్నికి విశ్వాసం లేదు. తెలిసి కాని, తెలియక కాని వారికి ఏనాడూ మనం అపకారం చేయలేదు. అయినా హాలాహలం కక్కింది".

నాన్న నా వంక అదోలా చూసి అతి కష్టం మీద అక్షరాలు కూడబలుక్కున్నట్లు అన్నాడు- నా ముప్పై ఏళ్ల జీవితం చెప్పనిది నాన్న అరవై ఏళ్ల అనుభవం ఒకే ఒక మాటగా వచ్చింది.

"మనం బ్రతికి చెడిన వాళ్లం" అని.

రైలు మరో గంట లేటుట. ఎక్కడో బాపట్ల దగ్గర యాక్సిడెంట్ అయిందట.

మరో గంట లేటు అంతేగా! ప్రయాణం ఆగదు కదా! నాకు నేనే వెన్ను తట్టుకున్నాను.

ఇంతలో పక్కలైనులో ఇంజను కూత కూసింది.

●